# క్రైమ్ కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 62 గుంటూరు, బుధవారం 12- 11 - 2025 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైమ్ కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో


- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.



సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349

# సీఎం కీలక ప్రకటన

## ఏపీలో వారందరికీ..లక్ష..

**అమరావతి, నవంబర్ 11 (క్రైమ్ కౌంటర్ న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్‌లోని ముస్లింలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభవార్త వినిపించారు. హజ్ యాత్రకు వెళ్లేవారికి లక్ష రూపాయలు చొప్పున సాయం చేస్తామని ప్రకటించారు. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన మైనార్టీ సంక్షేమ దినోత్సవానికి సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన హజ్ యాత్రికులకు రూ. లక్ష చొప్పున సాయం చేస్తామని ప్రకటించారు. కడప, విజయవాడలో హజ్ భవనాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మైనారిటీల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లల్లో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు.

ఇంట్లో బడికి వెళ్లే పిల్లలు ఎంతమంది ఉంటే.. అంతమందికి కూడా తల్లికి వందనం పథకం కింద నగదు ఇచ్చిన విషయాన్ని చంద్రబాబు గుర్తు చేశారు. సూపర్ సిక్స్ హామీలను.. సూపర్ హిట్ చేసి చూపించామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న కారణంగా కొన్ని పనులు ఆలస్యమవుతున్నాయని చంద్రబాబు అన్నారు. అయినా ధైర్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకూ రాష్ట్రానికి రూ. 10 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని చంద్రబాబు వివరించారు. విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సు ద్వారా మరో రూ. 10 లక్షల కోట్లు పెట్టుబడులు వస్తాయన్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఏపీ బ్రాండ్ దెబ్బతిందన్న చంద్రబాబు.. పెట్టుబడిదారులలో మళ్లీ నమ్మకం కలిగించి రాష్ట్రానికి తీసుకువస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు కూడా చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. కష్టపడి కాకుండా.. ఇష్టపడి పని చేయాలని సూచించారు. ఉద్యోగులకు అండగా ఉంటామని.. రాష్ట్రాభివృద్ధిలో అందరం భాగస్వామ్యం అవుదామని పిలుపునిచ్చారు. మరోవైపు మైనారిటీల అభివృద్ధికి ముందు నుంచి అండగా నిలిచింది టీడీపీనేని చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉర్దూ భాషను రెండో అధికారిక భాషగా చేసింది టీడీపీ హయాంలోనేనని అన్నారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ పెట్టింది టీడీపీ హయాంలోనేనని అన్నారు. ఉర్దూ అకాడమీ పెట్టింది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనేనని చంద్రబాబు స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తులని పరిరక్షించింది తామేనన్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా విమానంలో మక్కాకు పంపించే ఏర్పాట్లు చేసింది కూడా తామేనని చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తు చేశారు.

## తమ ప్రభుత్వ 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వల్లే సాధ్యమైందన్న లోకేశ్



**అమరావతి, నవంబర్ 11 (క్రైమ్ కౌంటర్ న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడి తరలివస్తోంది. దేశంలోనే అతిపెద్ద మల్టీ-లేయర్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ తయారీ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీస్ ముందుకొచ్చింది. తిరుపతి జిల్లా నాయుడుపేట సమీపంలో రూ. 1,595 కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను నెలకొల్పనున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ పరిశ్రమ ద్వారా 2,170 మంది యువతకు ఉన్నత నైపుణ్యం కలిగిన ఉద్యోగాలు లభిస్తాయని ఆయన తెలిపారు. ఈ పెట్టుబడి కేవలం ఒక పరిశ్రమ ఏర్పాటు మాత్రమే కాదని, రాష్ట్ర ప్రజల సామర్థ్యంపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని ఆచరణలో చూపిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలు వేగంగా కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా భూమి, నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను ముందే సిద్ధం చేసి, తక్షణమే అందించే పరిష్కారాలను అందిస్తున్నామని వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కంటే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానమే ఏపీని ప్రత్యేకంగా నిలుపుతోందని మంత్రి అన్నారు. ఈ విషయాన్ని సిర్మా ఎస్‌జీఎస్ మేనేజింగ్ డైరెక్టర్ జేఎస్ గుజ్రాల్ మాటలు బలపరుస్తున్నాయని చెప్పారు. "మాకు వేగం అవసరం, అందుకే ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నాం" అని గుజ్రాల్ అన్నట్లు లోకేశ్ ఉటంకించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత,

2 లో

## దేశంలో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు




సనాతర ధర్మం పరిరక్షణపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సతానత ధర్మ పరిరక్షణకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయడానికి ఇదే సరైన సమయం అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు.. తిరుమల తిరుపతి దేవస్థానం ఒక తీర్థయాత్ర క్షేత్రం కంటే ఎక్కువ అని చెప్పారు. తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి కేసులో సిట్ వివరాలు వెల్లడించిన నేపథ్యంలో పవన్ కళ్యాణ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ మేరకు ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం పోస్టు పెట్టారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ సమాజానికి.. తిరుమల తిరుపతి దేవస్థానం కేవలం పుణ్య క్షేత్రమే కాదు.. ఒక పవిత్రమైన ఆధ్యాత్మిక చిహ్నం. తిరుపతి లడ్డూ కేవలం మిఠాయి మాత్రమే కాదు..

2 లో


## రెండేళ్లలో మెడికల్ కాలేజీలు పూర్తి చేస్తాం:

**అమరావతి, నవంబర్ 11:** కూటమి ప్రభుత్వం తీసుకున్న పీపీపీ మోడల్ నిర్ణయం ద్వారా కేవలం రెండేళ్లలో మెడికల్ కాలేజీలు పూర్తి చేస్తామని సీడాప్ ఛైర్మన్ జి. దీపక్ రెడ్డి అన్నారు. వైసీపీ విధానంలో అయితే ఇదే పనికి 15-20 ఏళ్లు పడుతుందని ఎద్దేవా చేశారు. పీపీపీ విధానంతో మెడికల్ సీట్లు 500 నుంచి 1750కి పెరుగుతాయని చెప్పారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు అదనంగా 110 సీట్లు పెరుగుతాయని.. మొత్తం 850 సీట్లు పేద విద్యార్థులకే కేటాయించామన్నారు. పీపీపీ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం



2 లో

# రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు



**విజయవాడ, నవంబర్ 11:** రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. తానుంటే క్షేమంగా ఉంటామనే నమ్మకంతో తనకు ప్రజలు ఓట్లు వేశారని ఆయన తెలిపారు. మంగళవారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినం సందర్భంగా మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. పెన్షన్‌లు రూ. 4 వేలు, రూ. 6 వేలు, రూ. 15 వేలు ఇచ్చే ఏకైక ప్రభుత్వం మనదేనని ఆయన స్పష్టం చేశారు. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ నగదు ఇస్తున్నామన్నారు. సూపర్ సిక్స్.. సూపర్ హిట్ చేసి చూపించామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉండటం వల్ల కొన్ని పనులు కొంత ఆలస్యం అవుతున్నాయని వివరించారు. ఇంత అనుభవం ఉన్నా తనకే ఈ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతుబట్టడం లేదన్నారు. అయితే తనకు భయం లేదని.. అయిన ముందుకు సాగుతానని సీఎం చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. కేర్ ఫుల్‌గా డ్రైవ్ చేసే వ్యక్తిని కాబట్టి.. సురక్షితంగా ఒడ్డుకు తీసుకెళ్తానని భరోసా ఇస్తున్నానని పేర్కొన్నారు. తాను సైతం రాత్రింబవళ్లు పని చేస్తున్నానన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమానంగా తీసుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఏపీకి రూ. 10 లక్షల పెట్టుబడులు వచ్చాయని వివరించారు. విశాఖపట్నం వేదికగా జరగనున్న భాగస్వామ్య సదస్సు ద్వారా మరో రూ. 10 లక్షల పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. గూగుల్ ద్వారా రూ. లక్షా 25 వేల కోట్లు రానున్నాయని.. వాటిని ఐదేళ్లలో విశాఖపట్నంలో ఖర్చు పెట్టబోతున్నామన్నారు. కేంద్రం నగదు ఇస్తే.. మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. వారి చేతకాని పాలనతో.. కోట్లాది రూపాయల నిధులు కేంద్రం వద్ద ఆగిపోయాయన్నారు. వాటన్నింటినీ మళ్లీ సరిచేసి అమలు చేస్తామని ఈ సందర్భంగా ప్రజలకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.

ఏపీకి ఉన్న బ్రాండ్‌ను అంతా భ్రష్టు పట్టించారంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ అందరిలో నమ్మకం కల్గించి.. పెట్టుబడిదారులను తీసుకువస్తున్నామన్నారు. ఎవరైనా అసంతృప్తితో ఉంటే.. అందుకు కారణం తెలుసుకుని సమస్యను పరిష్కరిస్తున్నానన్నారు. కష్టపడి పని చేయకండి.. ఇష్టపడి పని చేయండంటూ ఉద్యోగులకు సీఎం చంద్రబాబు సూచించారు. తాను ఉద్యోగులకు అండగా ఉంటానని.. అందరం కలిసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం అవుదామని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. భగవంతుడు తనకు అన్ని అవకాశాలు ఇచ్చాడని.. తాను ప్రజల కోసమే పని చేస్తున్నానని పేర్కొన్నారు. సుదీర్ఘ కాలం తాను సీఎంగా ఉన్నానంటే.. అది ప్రజల ఆదరణ, అభిమానమే

2 లో

# జగన్ పిటిషన్ తిరస్కరించిన సీబీఐ కోర్టు

అక్రమాస్తుల కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దాఖలు చేసిన అభ్యర్థనను సీబీఐ కోర్టు తిరస్కరించింది. భద్రతా కారణాలతో ప్రత్యేక ఏర్పాట్లు అవసరమని జగన్ పేర్కొన్నా, కోర్టు అంగీకరించలేదు. యూరప్ పర్యటనలో ఫోన్ నంబర్ మార్చడం, బెయిల్ షరతులు ఉల్లంఘించారన్న అంశంపై సీబీఐ అభ్యంతరం తెలిపింది. నవంబర్ 21న జగన్ స్వయంగా హాజరు కావాలని కోర్టు ఆదేశించింది.



## తమ ప్రభుత్వ 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వల్లే సాధ్యమైందన్న లోకేశ్

ఓడరేవులకు సమీపంలో ఉండటం వంటి అనుకూలతల వల్ల అత్యాధునిక తయారీ రంగ సంస్థలకు ఏపీ మొదటి ఎంపికగా మారిందని అభిప్రాయపడ్డారు. భారత్ ఏటా సుమారు 70 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోందని, ఈ కొత్త ప్లాంట్ ఏర్పాటుతో ఆ దిగుమతుల భారాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని లోకేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పెట్టుబడి రాష్ట్రంలో బలమైన ఎలక్ట్రానిక్స్ తయారీ పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తుందని, ఇది రాష్ట్రానికి, ప్రజలకు గర్వకారణమైన మైలురాయి అని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

## రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

కారణమన్నారు. శాశ్వతంగా మీ వాడిగా ఉంటాను.. అన్ని విషయాల్లో తోడుగా ఉంటానని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా సయ్యద్ నషీద్ అహ్మద్‌ను లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారంతో సీఎం చంద్రబాబు సత్కరించారు. అలాగే ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఆయన సన్మానించారు. రాష్ట్ర మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని నేడు మనం జరుపుకుంటున్నామన్నారు. ఈ రెండూ చూస్తే ఒక చరిత్ర అని..మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు మనమంతా నివాళి అర్పించాలన్నారు. దేశంలో నేడు నాలెడ్జ్ ఎకానమీ వచ్చిందంటే.. అందుకు నాంది పలికిన వ్యక్తి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అని గుర్తు చేశారు. 1951లో దేశంలో తొలి ఐఐటీ స్థాపించిన వ్యక్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని చెప్పారు. అలాంటి మహనీయులను మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అబ్దుల్ కలాం రాష్ట్రపతి కావడానికి తాను ఆ రోజు సహకరించానని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. తాను మైనారిటీల అభివృద్ధికి కృషి చేస్తానని.. మీకు అండగా ఉంటానని వారికి సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మైనార్టీల కోసం చేసిన సంక్షేమాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు.

## దేశంలో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు

అది అందరిలో ఉండే భావోద్వేగం. తిరుపతి లడ్డూను అప్యాయంగా స్నేహితులు, కుటుంబ సభ్యులతో పాటు ముఖపరిచయం లేని వాళ్లకు పంపిణీ చేస్తాము. తిరుపతి లడ్డూను ఇలా అందజేయడం.. హిందువుల సమష్టి విశ్వాసాన్ని, నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతి సంవత్సరం సగటున దాదాపు 2.5 కోట్ల మంది భక్తులు తిరుమలను సందర్శిస్తారు. ఇలాంటి సనాతన భావాలు, ఆచారాలను ఎగతాళి చేస్తే హిందువులకు ఎంతో ఆవేదన కలుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది హిందువుల నమ్మకాన్ని, భక్తిని విచ్ఛిన్నం చేస్తుంది" అని పవన్ కళ్యాణ్ పోస్టులో పేర్కొన్నారు.

ఇదే సరైన సమయం.."లౌకికవాదం రెండు వైపులా ఉండాలి. హిందువుల విశ్వాసాలపై బేరసారాలు చేయలేం. మా సనాతన ధర్మం అత్యంత పురాతనమైనది. నిరంతరం అభివృద్ధి చెందుతున్న నాగరికత. అలాంటి సనాతన ధర్మం కోసం.. సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును స్థాపించడానికి ఇదే సరైన సమయం" అని పవన్ కల్యాణ్ చెప్పారు.సనాతన ధర్మ పరిరక్షణకు జాతీయ రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక చట్టం, బోర్డు ఏర్పాటు చేయాలని గతంలోనూ పవన్ కళ్యాణ్ మాట్లాడారు. ఈ మేరకు వారాహి డిక్లరేషన్‌లో పేర్కొన్న ఈ డిమాండ్‌ను.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు పెట్టారు. 2024లో అక్టోబర్‌లో తిరుపతిలో జరిగిన సభలో సనాతన ధర్మంపై కీలక వ్యాఖ్యలు చేశారు పవన్ కళ్యాణ్. సనాతన ధర్మం కోసం తాను ఏదైనా వదులుకోవడానికి సిద్ధం అని చెప్పారు. తిరుమలలో అపచారం జరుగుతోందని చెబితే.. గత ప్రభుత్వం పట్టించుకోలేదని.. అందుకే వారికి 11 సీట్లు వచ్చినట్లు ఎద్దేవా చేశారు. సనాతన ధర్మాన్ని మట్టిలో కలిపేస్తామని అన్నవారితో గొడవ పెట్టుకునేందుకే తిరుపతికి వచ్చినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. లౌకిక వాదం పేరుతో హిందువుల నోరు నొక్కేస్తున్నారని.. హిందువులకు అన్యాయం జరిగితే ఏ సెక్యులరిస్టు నోరు మెదపరు అంటూ నిలదీశారు.

## రెండేళ్లలో మెడికల్ కాలేజీలు పూర్తి చేస్తాం:

పేదలకు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన యూనివర్సల్ హెల్త్ పాలసీతో ఉచిత వైద్యం అందిస్తామని చెప్పారు. గత ఐదేళ్లలో ఖర్చు చేసిన రూ.1550 కోట్లు కేంద్ర నిధులేనన్నారు. జగన్ ప్రభుత్వం సొంతంగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. ఐదేళ్లలో కేవలం 18% కాలేజీ నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయని.. నర్సీపట్నం, విజయనగరం కాలేజీలకు నిధుల్లేక పనులు నిలిచిపోయాయని దీపక్ రెడ్డి అన్నారు. జగన్ జారీ చేసిన జీఓలు 107,108,133తో 50% సీట్లు ప్రైవేటుకు కేటాయించారని.. ఫీజులు రూ.10 వేల నుంచి రూ.12%-%20 లక్షలకు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రారంభించిన కాలేజీలను మెడికల్ కౌన్సిల్ తిరస్కరించిందని.. నిర్మాణాలు పాఠశాల స్థాయిలో ఉన్నాయని సీట్లు తగ్గించిందని ఫైర్ అయ్యారు. నీతి ఆయోగ్ నివేదికలో జగన్ పాలనలో ఏపీ 10వ స్థానానికి పడిపోయిందని విమర్శించారు. కరోనా సమయంలో వైసీపీ నేతలు వైద్యం కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లారని చెప్పారు. వైసీపీని ప్రజలు కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని.. ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం వైసీపీ అబద్ధపు ప్రచారాలు చేస్తోందన్నారు. ప్రజలు జగన్ ముఠా నాటకాలను తిప్పికొట్టాలని చెప్పారు. స్వర్ణాంధ్ర సాధన దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.

## వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా తేజ్ భరత్

విశాఖపట్నం, నవంబరు 11 విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి ఎన్.తేజ్ భరత్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన ప్రస్తుతం మెప్మా డైరెక్టర్‌గా విజయవాడలో పనిచేస్తున్నారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న విశ్వనాథన్‌ను గత నెల తొమ్మిదో తేదీన ఐ అండ్ పీఆర్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసిన సంగతి తెలిసిందే. విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆయన సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి తరచూ వెళుతున్నా పెట్టుబడుల సదస్సు కారణంగా వీఎంఆర్‌డీఏపై పూర్తిగా దృష్టి పెట్టలేకపోతున్నారు. ముఖ్యంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమయ్యేలోగా ఏడు మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించే బాధ్యతను ప్రభుత్వం వీఎంఆర్‌డీఏకు అప్పగించింది. విశ్వనాథన్ వెళ్లిన తరువాత ఆ పనుల్లో పెద్దగా పురోగతి లేకుండా పోయింది. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి వెళ్లడంతో పూర్తిస్థాయి అధికారిని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. నగరంలో ఈ నెల 14, 15 తేదీల్లో పెట్టుబడుల సదస్సు జరగనున్న ఉన్న నేపథ్యంలో తేజ్ భరత్ వెంటనే విధుల్లో చేరే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేశ్ విశాఖపట్నం వచ్చేసరికి ఆయన ఇక్కడ బాధ్యతలు తీసుకుంటారని సమాచారం.

# వెనుకబడిన పల్నాడు వాసిగా గర్వపడుతున్నాను.

### ఏపీ ఎస్సీ కమిషన్ మెంబర్ గా అవకాశం పెద్దల వరం..!





**క్రైం కౌంటర్ న్యూస్ దుర్గి:పులిమెల మాణిక్యం.** వెనుకబడిన పలనాడు జిల్లా వాసిగా దక్కిన గౌరవప్రదమైన పదవికి తానేంతగానో గర్వపడుతున్నానని ఏపీ ఎస్సీ కమిషన్ మెంబర్ గా ఎంపికాబడిన మేకల భిక్షం అలియాస్ దాస్ మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.కోటి మందిలో ఒక్కరిని మాత్రమే వరించే రాజ్యాంగ బద్దమైన ఎస్సీ కమిషన్ లో తనకు చోటు కల్పించడం దేవుడిచ్చిన వరంలా భావిస్తున్నాని స్పష్టం చేశారు.ఈ పదవి బాధ్యతలకు ఎంపిక చేసిన ఏపీ ముఖ్యమంత్రి మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడుకి,గౌరవ మాన్యశ్రీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి,గౌరవ మాన్యశ్రీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కి ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.అలానే పదవికి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించి, ప్రోత్సహించిన మాచర్ల శాసన సభ్యులు మాన్యశ్రీ జూలకంటి బ్రహ్మానందరెడ్డికి ఎంతగానో రుణపడి ఉంటానని మేకల పేర్కొన్నారు.అలానే తాను ఈ స్థాయికి రావడానికి వెన్నంటే ఉండి ముందుకు నడిపించిన తెలుగుదేశం,జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు, బంధుమిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## డాక్టర్ చినరాజుకూ పదవి రావడం పట్ల స్పందించిన మండల నాయకులు





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ బోర్డు డైరెక్టర్గా పెదకూరపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ చినరాజుకు ఇచ్చిన నేపథ్యంలో గ్రామంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల పార్టీ సమావేశం అయింది . ఈ సందర్భంగా ముందుగా మండలానికి ఈ పదవి రావడానికి కారణమైన గౌరవ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు మండలం తరపు నుండి తెలుపుతున్నామని నాయకులు అన్నారు . అనంతరం చినరాజు గురించి అతను పద్ధతి, మంచితనం, గురించి పార్టీకి చేసిన సేవలు గురించి , నాయకులు తమ మనసులో మాటనూ మీడియాతో పంచుకున్నారు . తదుపరి కేక్ కట్ చేసి చిన్న రాజుకు శుభాకాంక్షలు తెలియజేసి ఒకరికి ఒకరు కేక్ ను తినిపించుకొని సందడి చేశారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన నాయకులు మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, సర్పంచ్ రాజు, జిల్లా నాయకులు అర్తిమల్ల రమేష్, గల్లా బాబురావు, వడ్లమూడి అప్పారావు, బెల్లంకొండ గోపాలరావు, భాష్యం ఆంజనేయులు, మద్దినేని సత్యనారాయణ, ముంతాజ్, గంగినేని లీలావతి, కృష్ణకుమారి, హంద్ర ప్రసాద్, గల్లా శివ నాగరాజు, సరిపూడి గోపి, గుడిపూడి బాబురావు, కంచర్ల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు

## కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గర్భిణీలు, రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ



**గోకవరం నవంబర్ 11 క్రైమ్ కౌంటర్ ప్రతినిధి** విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు చేపట్టిన ప్రజా సేవ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఇందులో ముఖ్యంగా రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ కార్యక్రమం ఒకటి. సుమారుగా రెండేళ్ల నుంచి గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో గర్భిణీలు, అక్కడికి చికిత్స కోసం వచ్చే రోగులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రతి మంగళవారం పండ్లు, పాలు, రొట్టెలను కంబాల శ్రీనివాసరావు ఉచితంగా అందజేస్తున్నారు. ఈ మంగళవారం కూడా యధావిధిగా రామసేన సిబ్బంది గర్భిణీలు, రోగులకు పాలు, పండ్లు, రొట్టెలను అందజేశారు. తన సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటాయని, తన వద్దకు కష్టం అని వచ్చిన వారికి, లేదు అనకుండా సహాయం చేసి తిరిగి పంపిస్తున్నానని, కంబాల శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సిబ్బంది వీరబాబు, బాబీ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# మాగులూరి ఫౌండేషన్ నిరంతర సేవా ప్రస్థానం





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పల్నాడు జిల్లా :** ఎన్నో సంవత్సరాలుగా గ్రామీణ విద్య, వైద్య రంగాలలో వందలాది సేవా కార్యక్రమాలతో సాగుతున్న మాగులూరి ఫౌండేషన్.. పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణీ స్త్రీలకు పలు మండలాల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో పౌష్టికాహారం అందిస్తున్నారు. స్వయంగా ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని క్రమం తప్పకుండా అందిస్తూ వేలాది మంది తల్లులకు సందర్భానుసారంగా చేయూత నందిస్తున్నారు. ప్రజల ధనం ప్రజలకే ఖర్చుపెట్టే ప్రభుత్వాల కన్నా, తమ కష్టార్జితంనుండి వందలాది మందికి నిస్వార్ధ సేవాభావంతో అండగా నిలుస్తున్న మాగులూరి ఫౌండేషన్ ను ప్రభుత్వ వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, సామాన్య ప్రజలూ అందరూ అభినందిస్తున్నారు. తాను చేస్తున్న ప్రతి కార్యక్రమం యువతకు స్ఫూర్తి నందించాలని మన ప్రాంతం మన భాద్యత అని సామాజిక దృక్పధం యువత అలవర్చుకోవాలని ఎన్నారై మాగులూరి భానుప్రకాష్ తెలిపారు.



మధ్యప్రదేశ్ గౌరవ పురస్కారం అందుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షేక్ మహబూబ్

ఈ అవార్డును మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నగరంలో ప్రధానం చేశారు డాక్టర్ షేక్ మహబూబ్ వలి గారికి భోపాల్ మేయర్ కిషన్ సూర్య వంశీ మరియు మధ్యప్రదేశ్ క్యాబినెట్ మంత్రి ప్రతిమ భాగెల్ అవార్డును ప్రధానం చేశారు. డాక్టర్ షేక్ మహబూబ్ వలి గారిని సివిల్ పబ్లిక్ వెల్ఫేర్ సమస్త జాతీయ అధ్యక్షులు సంజయ్ కుమార్ యాదవ్ గారు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ పబ్లిక్ వెల్ఫేర్ సర్వీస్ అధికారిక పత్రాన్ని మరియు ఐడి కార్డ్ అందజేశారు. సివిల్ పబ్లిక్ వెల్ఫేర్ సర్వీస్ జాతీయ అధ్యక్షులు మాట్లాడుతూ మీ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సివిల్ పబ్లిక్ వెల్ఫేర్ సర్వీస్ సమస్త బాగా అభివృద్ధి చెందుతుంది అని నేను ఆశిస్తున్నాను నీకు పేరు కోవడం జరిగినది.

## అన్నసమారాధన కార్యక్రమానికి కంబాల 200 కిలోల బియ్యం విరాళం



**గోకవరం నవంబర్ 11 క్రైమ్ కౌంటర్ ప్రతినిధి :** గోకవరం మండలం ఇటికాయలపల్లి గ్రామం ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలోని ఉసిరి చెట్టు వద్ద నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు 200 కిలోల బియ్యాన్ని విరాళంగా అందజేశారు. కంబాల శ్రీనివాసరావు అందుబాటులో లేనప్పటికీ ఆయన ఆదేశాల మేరకు రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు గ్రామంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలిత ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఈ అన్నసమారాధన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు బీజేపీ నాయకులు వరసాల ప్రసాద్, బత్తుల నానాజీ, నాగ రమేష్, వీరాంజలి, దేశాల నరేష్, దోసపాటి సుబ్బారావు, నెల్లి శ్రీను, తటికొండ సురేష్, ధార శ్రీను, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్న సిఐ రామసుబ్బయ్య.!!



**పెద్దవడుగూరు, నవంబర్ 11 క్రైమ్ కౌంటర్ రిపోర్టర్ రాము :** అనంతపురం జిల్లా పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తున్న సిఐ రామసుబ్బయ్య కి ఎస్పీ జగదీష్ చేతుల మీదగా అప్రిటేషన్ సర్టిఫికెట్ అందుకోవడం జరిగింది. సిఐ రామసుబ్బయ్య విధుల్లో సక్రమంగా నిర్వహిస్తూ లా అండ్ ఆర్డర్ పాటిస్తూ ప్రజల అభిమానాలు పొందుతున్న దృశ్య ఆయనకు ఉత్తమ సిఐగా అభినందిస్తూ ప్రశంస పత్రాన్ని ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా సిఐ రామసుబ్బయ్య మాట్లాడుతూ విధుల్లో ఏ ఒక్కరికి కూడా అన్యాయం జరగకుండా ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తూ అందర్నీ కలుపుకొని పోతూ తన పరిధిలో శాంతి భద్రతలను కాపాడుతూ విధులు నిర్వహిస్తున్నారని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు సిఐ కు ప్రశంస పత్రాన్ని అందజేయడం పట్ల మండల ప్రజలు పలువురు ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## ఉపాధి హామీ గ్రామసభలో పాల్గొన్న జూనియర్ ఇంజనీర్ రవికుమార్



**కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** 2025, 26 సంవత్సరాల లో పెదకూరపాడు మండలంలో ఉపాధి హామీ గ్రామీణ పథకం నుండి కొత్త పనులు గుర్తించే అంశంపై గ్రామసభ నిర్వహించారు పెదకూరపాడు మండల జాతీయ గ్రామీణ అభివృద్ధి పథకం జూనియర్ ఇంజనీర్ జె . రవికుమార్ . మండలంలోని జలాలపురం మూసాపురం పాటిబండ్ల గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు కూలీలు తదితరులు పాల్గొన్నారు .

## ఎస్సై గిరిబాబుకు కృతజ్ఞతలు తెలిపిన క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు



**: క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** రెండు నెలల క్రితం చుట్టం చూపుగా పెదకూరపాడు గ్రామానికి వచ్చిన క్రైమ్ కౌంటర్ విలేకర్ కోటేశ్వరరావు తోడల్లుడు సత్తనపల్లి మండలం కొండమొడు గ్రామానికి చెందిన కొరబండి సభాష్టియన్ పొరపాటున తన మొబైల్ ఫోన్ను పెదకూరపాడు గ్రామంలో పోగొట్టుకోవటం జరిగింది దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వగా పెదకూరపాడు ఎస్సై గిరిబాబు చాకచక్యంగా వ్యవహరించి పోగొట్టుకున్న ఫోనును బాధితుడు తమ్ముడు విలేకర్ కోటేశ్వరావుకి మంగళవారం సిబ్బంది చేత అందించారు ఈ సందర్భంగా బాధితుడు మండల పోలీసువారికి ఫోన్లో హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు

## డాక్టర్ చినరాజును అభినందించిన అర్తిమల్ల రమేష్



**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ డైరెక్టర్గా నియమితులైన డాక్టర్ గుడిపూడి చిన్నరాజుకి పెదకూరపాడు మండల తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు, జిల్లా పార్టీ నాయకులు అర్తిమల్ల రమేష్ మంగళవారం హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు . ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జరిగిన పెదకూరపాడు పంచాయతీ ఎన్నికల్లో ఏం సాధించటంలో కీలక భూమిక పోషించి అప్పటినుండి ఇప్పటివరకు పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ ఎస్సీ వర్గాన్ని నియోజకవర్గంలో బలోపేతం చేస్తున్న డాక్టర్ గారిని ముఖ్యమంత్రి చంద్రబాబు లోకేష్ బాబు ,గుర్తించి పదవి ఇవ్వటం సంతోషమని రమేష్ అన్నారు . ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు .

## అమరావతి గురుకుల పాఠశాలలో అవేర్నెస్ ప్రోగ్రాం




**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు అమరావతి న్యూస్ :** అమరావతి గురుకుల పాఠశాలలో మండల సీఐ అచ్చయ్య, ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉమెన్ సేఫ్టీ ,సైబర్ క్రైమ్, ఆన్లైన్ ఫ్రాడ్ గురించి అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## భ్రమల్లో ఉంటున్నామా? అభివృద్ధి చెందుతున్నామా




**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పల్నాడు జిల్లా :** నేడు దేశ, రాష్ట్ర పౌరులంతా ప్రశ్నించుకోవాల్సిన సమయం, అవసరం.. సామాజికంగా,సమిష్టిగా అభివృద్ధి చెందుతున్నామా, లేక ఆ భ్రమలో నెట్టబడుతున్నామా? దశాబ్దాలుగా సమాజానికి పట్టిన జాడ్యాలు.. వ్యవస్థీకృతమైన అవినీతి, మద్యం, మూఢమమ్మకాలు, ఉచిత (అవినీతి) పథకాలు..చివరికి దేశ సమగ్రతకూ, జన జాగృతికి మూలాలైన విద్య, వైద్యం, న్యాయం, అధికారం, వ్యవస్థ, మీడియా.. ఇలా ప్రతి రంగం దేశంలో ఆశ్రీత పక్షపాతం, అవినీతి పతాకస్థాయిలో వేళ్ళూనుకు పోయి.. యువతను సాంకేతిక దుష్పరిణామాలవైపు ప్రేరేపించే అవకాశం కల్పిస్తూ.. మద్యం తాగి వాహనాలు నడపటం, సామాజిక మాధ్యమాల అవాస్తవ సమాచారంతో అభూతకల్పన, యువశక్తిని ఉత్పాదకత చంపి, ఓట్ల కోసం ఉచితాలు, మద్యం సిండికేట్లు.. ఇదీ మన చుట్టూ వున్న నిర్మించుకుంటున్న సమాజం.. చంద్రబాబు నాయుడు గారి లాంటి నాయకుడు 75 ఏళ్ళ వయసులో పడే కష్టాన్ని, రాష్ట్రం కోసం కనే కలల్ని యువత ఉజ్జ్వల భవిత కోసం నిజం చేయాలంటే.. కళ్ళు తెరిచి మనం నిజాయితీ, క్రమశిక్షణ పాటించి సంస్కరించుకోవాల్సింది ముందుగా వ్యవస్థల పునాదుల్ని, పారదర్శక పాలననూ, అవినీతి రహిత నాయకత్వాన్ని.. అర్థం చేసుకోవలసింది చంద్రబాబు గారి దార్శనిక భావజాలాన్ని.. అంతే తప్ప ఫోటోలు, ఫ్లెక్సీలు, ప్రచార ఆర్భాట పటాటోపాలను కాదు.. ఎవరేం చేసినా ప్రజలు గమనిస్తారు.. కానీ సమయం వచ్చినప్పుడు వారి విచక్షణ, అనుభవాలను గుర్తుపెట్టుకొని స్పందిస్తారు. అధికారం, ప్రభుత్వ ఉద్యోగం..దర్పం, అలంకారం కాదు.. అది సమాజం పట్ల సమున్నత భాధ్యత..

## జాతీయ అవార్డుకు ఎంపికైన మురుగుమ్మి



ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 11 : డ్వామా నీటి సంరక్షణ పథకంలో జాతీయ ఉత్తమ పురస్కారానికి కనిగిరి నియోజకవర్గ పరిధిలోని మురుగుమ్మి గ్రామ పంచాయతీ ఎంపికైంది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో అక్కడి వాటర్ షెడ్, ఇతరశాఖల భాగస్వామ్యంతో ఉత్తమ నీటి యాజమాన్య విధానాలను పాటించారు. పలురకాలైన సహజ పద్ధతుల్లో వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలమట్టం పెంపొందించడంలో విజయం సాధించారు. కందకాల పనులు, చిన్న, పెద్ద ఊటకుంటలు, పాండ్స్, అమృత్ సరోవర్లు, పూడికతీత పనులు చేయడం ద్వారా సుమారు 8.21 లక్షల క్యూబిక్ మీటర్ల నీటిని నిల్వ చేశారు. అందుకోసం 51 పనులకు రూ.97 లక్షలు వెచ్చించారు. ఆయా పనులను కేంద్ర బృందం ఇటీవల తనిఖీలు చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ, జలవనరుల శాఖ ఇచ్చే జాతీయ ఉత్తమ నీటి పురస్కార అవార్డుకు ఆ పంచాయతీని ఎంపిక చేశారు. ఈనెల 18న రాష్ట్రపతి చేతుల మీదుగా న్యూఢిల్లీలో ట్రోఫీ, ప్రశంసాపత్రం, రూ.1.5 లక్షల నగదు బహుమతిని అందుకోనున్నారు.



సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ల మండలం తొండపి గ్రామం నందు నలబోతు వారి వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరయ్యి నూతన వధూవరులను ఆశీర్వదించిన. సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు. శ్రీ కన్నా లక్ష్మీనారాయణ గారు ఈ కార్యక్రమం లో వివిధ హెూదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# రాష్ట్ర వృత్తి నైపుణ్య పోటీలకు కారంపూడి బ్రహ్మనాయుడు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక






క్రైం కౌంటర్ కారంపూడి రాష్ట్ర వృత్తి నైపుణ్య పోటీలకు కారంపూడి బ్రహ్మనాయుడు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఐ శివ శేషి రెడ్డి తెలిపారు. విద్యార్థులకు వివిధ వృత్తులు నైపుణ్యల పై విద్యాశాఖ సమగ్ర శిక్ష అభియాన్ వారి ఆధ్వర్యంలో ఈ నెల ఏడో తేదీన ధూళిపాళ్లలోని లయోలా ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కిల్ కాంపిటీషన్లో పాఠశాల వోకేషనల్ విభాగాలైన ఐటి మరియు ఫుడ్ ప్రాసెసింగ్ల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం లోని విద్యార్థులు ఈ పోటీల్లో ప్రథమ స్థానం పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలియజేశారు. ఈ విద్యార్థులకి డీఈఓ చంద్ర కళ గారు మరియు జీసీడీవో రేవతి గారి చేతుల మీదుగా బహుమతి అందజేశారు. రాబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా మంచి ప్రతిభను చూపాలని పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అందరూ కూడా అభినందించారు.


# రూ.25 వేలు కడితే,,,18 ఏళ్లు దాటిన మహిళలకు ఇల్లు



రాష్ట్రంలో పేదలు అందరికీ సొంత ఇల్లు ఉండేలా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధానమంత్రి ఆవాస్ యోజనను రాష్ట్రంలో అమలు చేస్తోంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఎన్టీఆర్ నగర్ పేదలందరికీ ఇళ్లు పథకం పేరుతో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాలతో పాటుగా, పట్టణాలలో ఉండే వారికీ ఇళ్లు మంజూరు చేస్తున్నారు. అలాగే వారికి ఆర్థిక సాయం అందిస్తూ సొంతింటి కలను సాకారం చేసేలా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే కడప వాసులకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. పీఎంఏవై(అర్బన్) ఎన్టీఆర్ నగర్ పేదలందరికీ ఇళ్లు పథకం కింద టిడ్కో ఇళ్లను కేటాయించనుంది. టిడ్కో ద్వారా వివిధ విభాగాల్లో నిర్మించిన జీప్లస్ 3 ఇళ్లను అర్హులకు కేటాయించనున్నారు. ఈ విషయాన్ని కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి వెల్లడించారు.

టిడ్కో ఫేజ్-1 కింద శ్రీ లక్ష్మీనగర్, ఫేజ్ 2 కింద చలమారెడ్డిపల్లిలో ఇళ్లు నిర్మించారు. 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు,430 చదరపు అడుగుల్లో వీటిని నిర్మించారు. వీటిని ఇప్పుడు అర్హులకు కేటాయించనున్నారు . అయితే 300 చదరపు అడుగులలో నిర్మించిన ఇళ్లను ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందించనుంది. 365 చదరపు అడుగుల ఇళ్ల కోసం లబ్ధిదారులు రూ. 7.55 లక్షలు కట్టాల్సి ఉంటుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.1.5 లక్షలు అందిస్తే, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద 2.65 లక్షలు చెల్లిస్తుంది. మిగతా రూ. 3.15 లక్షలను బ్యాంకు రుణం రూపంలో అందిస్తారు. ఇల్లు పొందిన లబ్ధిదారులు రూ. 25 వేలు కట్టాల్సి ఉంటుంది.

మరోవైపు 430 చదరపు అడుగులలో నిర్మించిన ఇంటి ధరను రూ. 8.55 లక్షలుగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ. 1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 2.90 లక్షలు అందిస్తుంది. 3.65 లక్షల రూపాయలను బ్యాంకు రుణంగా అందిస్తారు. లబ్ధిదారులు రూ. 50 వేలు కట్టాల్సి ఉంటుంది. ఒకవేళ లబ్ధిదారులు బ్యాంక్ రుణం వద్దనుకుంటే సొంతంగా చెల్లించవచ్చు. అయితే ఈ టిడ్కో ఇళ్లు పొందేందుకు ప్రభుత్వం కొన్ని అర్హతలు నిర్దేశించింది. మహిళలకే ఈ ఇళ్లు కేటాయిస్తారు. అలాగే వారి వయసు18 సంవత్సరాలు పైబడి ఉండాలి. కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వారై ఉండాలి. సొంత ఇల్లు, భూమి, ఇంటి పట్టా ఉన్నవారు అనర్హులు. అలాగే వార్షిక ఆదాయం మూడు లక్షల రూపాయలలోపు ఉండాలి. ఇప్పటికే కేంద్రం, రాష్ట్రం ద్వారా ఏవైనా గృహ నిర్మాణ సాయం పొంది ఉంటే పథకానికి అనర్హులు అవుతారు. కరెంట్ వినియోగం కూడా నెలకు 300 యూనిట్లు తక్కువ ఉండాలి. అర్హతలు, ఆసక్తి ఉన్నవారు నవంబర్ 25వ తేదీలోపు కడప మున్సిపల్ కార్పొరేషన్ ప్రణాళిక విభాగంలో దరఖాస్తులు అందించాలని అధికారులు సూచించారు.



# నరసరావుపేటలో ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి వేడుకలు

## స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు




క్రైమ్ కౌంటర్ పల్నాడు జిల్లా బ్యూరో ఎం రవి నరసరావుపేట, నవంబర్ 11, 2025: భారత స్వాతంత్ర్య సమరయోధుల్లో ముఖ్యమైన వ్యక్తిత్వం, దేశ మొదటి విద్యా శాఖ మంత్రిగా ప్రసిద్ధి చెందిన మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ల 137వ జయంతి ఉత్సవాలు నరసరావుపేట లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ముస్లిం మైనారిటీ సోదరులు, ఉమ్మడి కూటమి నాయకులు, విద్యార్థులు, స్వాతంత్ర్య సమరయోధులు, సామాజిక కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్రదర్శన అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పలనాడు జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ వారి జీవితం, స్వాతంత్ర్య సమరంలోని కృషి, విద్యా రంగంలో చేసిన సేవల గురించి వివరించారు. సభకు ముందుగా మౌలానా ఆజాద్‌ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరాజ్ ధనుంజయ్, మైనారిటీ సంఘం నాయకులు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ చదలవాడ అరవింద బాబు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అమరత్వం సంపాదించిన మహానుభావులు అని అన్నారు . 1888, నవంబర్ 11న మక్కాలో జన్మించిన ఆయన, చిన్నప్పటి నుంచే ఇస్లామిక్ విద్యలో పాండిత్యం పొంది, హిందూ-ముస్లిం ఐక్యతకు ప్రతిపాదకుడిగా మారారు. గాంధీజీతో కలిసి ఖిలాఫత్ ఉద్యమం, నాన్-కోఆపరేషన్ మూవ్‌మెంట్‌లలో కీలక పాత్ర పోషించారు. బ్రిటిష్ పాలిత ప్రభుత్వం చేత 1921లో జీవిత ఖైదు శిక్ష అనుభవించినప్పటికీ, వారి ధైర్యం, త్యాగాలు దేశ స్వాతంత్ర్యానికి మార్గదర్శకాలుగా నిలిచాయి. స్వాతంత్ర్యానంతరం భారతదేశ మొదటి విద్యా మంత్రిగా 1947 నుంచి 1958 వరకు పనిచేసిన ఆయన, జాతీయ విద్యా విధానాన్ని రూపొందించారు. ఐ.ఐ.టీలు, ఐ.ఐ.ఎస్‌సీల స్థాపనకు మార్గదర్శకత్వం వహించారు. 'భారతీయ విద్యా సంస్కరణలు' పేరుతో ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపిన ఆయన, విద్యను సామాజిక సమానత్వానికి సాధనంగా మార్చారు. ముస్లిం మైనారిటీల విద్యా అభివృద్ధికి దోహదపడ్డారు. ఆయన రచనలు 'గుబ్బార్-ఏ-ఖాక్', 'ఇండియా విన్స్ ఫ్రీడమ్' వంటివి దేశ చరిత్రను ఆవిష్కరిస్తాయి," అని వివరించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి దేశభక్తుల గురించి, స్వాతంత్ర్య సమరయోధుల గురించి నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విధంగా జయంతి ఉత్సవాలు జరుపుకోవడం వల్ల యువతలో దేశభక్తి పెరుగుతుంది. భారతదేశం లౌకిక దేశమని, అన్ని మతాలకు సమాన హక్కులు కల్పించబడ్డాయి. ఈ ఆదర్శాలను అనుసరించి నరసరావుపేటలో విద్యా కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తాము," అని డాక్టర్ అరవింద్ బాబు హామీ ఇచ్చారు. సమావేశంలో మౌలానా ఆజాద్‌ల జీవిత చరిత్రపై చర్చా సెషన్, విద్యార్థులకు బహుమతుల పంపిణీ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమం ద్వారా మౌలానా ఆజాద్‌ల వారసత్వాన్ని కొత్త తరానికి పరిచయం చేయడంలో విజయవంతమైంది.

# చెప్పుల కారణంగా దొరికిపోయిన అంతర్రాష్ట్ర ముఠా

సముద్రంలో ఈది పిల్లకాలువలో మునిగి చచ్చినట్లు.. అని మన పెద్దోళ్లు చెప్పిన మాట గుర్తుందా.. అలాగే ఉంది ఈ దొంగల యవ్వారం. పేరుకేమో అంతర్రాష్ట్ర దొంగల ముఠా . ఒకొక్కర్కరిపై పదుల సంఖ్యలో కేసులు.. కానీ ఓ చిన్న తప్పుతో పోలీసులకు దొరికిపోయారు. అది కూడా చెప్పుల కారణంగా.. దీంతో ప్రస్తుతం ఊచలు లెక్కబెట్టాల్సి వస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన తరుణ్ కుమార్ రాజు, ఎలెయ్ రాజు, మావుళ్లు, లోకేష్, రాజి, మరో బాలిక. వీరంతా చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులు. భీమవరంలోని చిన్నపేటలో ఉంటారు. అయితే చిన్నప్పుడే వీరి జీవితం గాడి తప్పింది. చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. ఈ వ్యసనాల కోసం డబ్బులు అవసరమయ్యాయి. దీంతో దొంగతనాలు ప్రారంభించారు. వీరిలో తరుణ్ కుమార్ రాజు మీద ఇప్పటికే 41 కేసులు ఉన్నాయి. ఎలెయ్ రాజుపై 30 కేసులు ఉన్నాయి. అయితే వీరంతా ఓ ముఠాగా ఏర్పడ్డారు. గోదావరి జిల్లాల్లో చోరీలు మొదలుపెట్టారు. ఒకటీ రెండు కాదు భారీ సంఖ్యలో చోరీలు చేశారు. ఈ చోరీ సొమ్మును బాలికకు, లోకేష్‌కు అందిస్తూ వచ్చారు.ఈ క్రమంలోనే ఈ ఏడాది మే నెలలో పోలీసులకు దొరికిపోయారు. కొన్ని రోజులు రాజమండ్రి జైలులో రిమాండ్‌లో ఉన్నారు. అక్టోబర్ నెలలో రాజమండ్రి జైలు నుంచి బెయిల్ మీద బయటకు వచ్చారు. అయితే ఆ తర్వాతే మనోళ్లు ప్లాన్ మార్చారు. గోదావరి జిల్లాల్లో చోరీలు చేస్తే దొరికిపోతామనే భయంతో.. తమ మకాం హైదరాబాద్‌కు మార్చారు.

నవంబర్ నాలుగో తేదీన ఈ ఐదుగురు. మరో బాలిక కలిసి హైదరాబాద్‌కు బస్సులో బయల్దేరారు. అయితే ఎన్టీఆర్ జిల్లా నందిగామ వద్దకు రాగానే ఓ బైక్ చోరీ చేసేందుకు మంచి అవకాశం వచ్చింది. దీంతో బైక్ చోరీ చేశారు. నవంబర్ ఐదో తేదీన నాదర్‌గుల్‌లోని కమ్మగూడలో గది అద్దెకు తీసుకున్నారు. ఆ రోజే హయత్‌నగర్ వద్ద మరో బైక్ చోరీ చేశారు. ఈ రెండు బైక్‌లపై తిరుగుతూ ఆలయాలు, షాపులు, ఇళు ఇలా వరుసగా 12 చోట్ల దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ డబ్బులతో కమ్మగూడ చేరుకున్నారు. అక్కడే పార్టీ చేసుకుని.. అదే రోజు భీమవరం వెళ్లిపోయారు. అయితే మరోసారి చోరీ చేయాలని నిర్ణయించుకుని నవంబర్ 7న మరోసారి అద్దెకు తీసుకున్న గదికి చేరారు.మరోవైపు హైదరాబాద్‌లో వరుస చోరీలతో పోలీసులు అలర్ట్ అయ్యారు. సౌత్‌ఈస్ట్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దొంగల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే దొంగల వేలిముద్రలు, సీసీ టీవీ కెమెరాల ఫుటేజ్ పరిశీలించారు. అయితే ఎలాంటి ఉపయోగం లేకపోయింది. అయితే ఐఎస్ సదన్ పరిసరాల్లోని సీసీ టీవీ ఫుటేజ్‌లో.. బైక్ మీద వెళ్తున్న ఇద్దరు యువకుల బూట్లు, చెప్పులు పోలీసులకు వింతగా కనిపించాయి.అలాగే వారి తీరుపైనా అనుమానం కలిగింది. వీటి ఆధారంతో చంపాపేట్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ చెప్పులు ధరించిన యువకుడు ద్విచక్రవాహనంపై వస్తున్నట్టు గమనించారు. అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించటంతో.. చోరీ చేసినట్టు అంగీకరించారు. ఈ నేపథ్యంలో ఐదుగురు నిందితులు, బాలికను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు బైక్‌లు, రూ.17,104 నగదు, నాలుగు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు.. బాలికను జువనైల్ హెూమ్‌కు తరలించారు.

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.